International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.4, Issue-9, September 2017
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

# "తమ అస్తిత్వానికై ఎలుగెత్తి కవితాగానం చేసిన సమూహం"

**డా॥ బూసి. వెంకటస్వామి**
శాఖాధిపతి, తెలుగు విభాగము,
పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల,
పెదనందిపాడు, గుంటూరు – 522 235,
: 9491130301, 7386529274
E-Mail : busi.venkataswamy3@gmail.com

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు అయినప్పటికీ సమాజంలో తమ స్థానమేంటో, ఏ సామాజిక వర్గంలో చేరతామో అర్థంకాని అయోమయ పరిస్థితిని, తమ అస్తిత్వాన్ని ప్రశ్నించుకుంటున్నారు బి.సి.,లు. ఒకవైపు అగ్రవర్ణాల వారు ఆధిపత్యం చెలాయిస్తూ తమను దరిచేర నీయకపోవటం, మరొకవైపు దళిత ఉద్యమ నేపథ్యంలో వారితో మమేకమైపోయినప్పుడు చుండూరు, కారంచేడు సంఘటనలతో దళితులంటే యస్.సి.,లు, యస్.టి.,లు మాత్రమే అని నిబద్ధత విధించుకున్నప్పుడు తమ పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా మారినప్పుడు తమకు ఒక గొంతిక ఉండాలనే ఆవశ్యకతను గ్రహించి అంబేద్కర్ – పూలే ఆలోచనా ధోరణి వెంట పయనిస్తూ బి.సి., లందరూ ఏర్పాటు చేసుకున్నవాదమే బి.సి.,వాదం. వారు వ్రాసుకున్న కవిత్వమే బి.సి., అస్తిత్వ వాద కవిత్వం.

దళితోద్యమకారులు బి.సి.,లను తమతో కలుపుకోవటానికి నిరాకరించినప్పుడు సహానుభూతికి, స్వీయానుభూతికి తేడా ఉందని గ్రహించిన క్రమంలో 2001వ సం॥లో జూలూరి గౌరీశంకర్ సంపాదకత్వంలో "వెంటాడే కలాలు – వెనుకబడిన కులాలు" అనే కవితా సంకలనం బి.సి.,ల గొంతులో నుండి బి.సి.,ల ఆత్మగౌరవ కవితగా వెలువడింది. నిచ్చెనమెట్ల సమాజంలో మధ్యస్థంగా ఉన్న నడిమికులాల గొంతికలు ఏకమై వెలువరించిన ఈ కవితా సంకలనంలో సమస్తవృత్తులు, సమస్తచిహ్నాలు, అస్తిత్వ సంతకాలుగా ప్రకటించుకున్నాయి. అయితే ఈ బి.సి., అస్తిత్వ ఉద్యమనేపథ్యం తెలుగు సాహిత్యంలోకి ఎంత వేగంగా ప్రవేశించిందో అంతే వేగంగా చల్లారిపోయింది. అందుకు కారణం కూడ లేకపోలేదు. బి.సి.,లు అనేక రకాలకులాలుగా ఉంటూ వెనుకబడిన తరగతులుగా ఉ ండటం ఒక కారణమైతే, ఉమ్మడి సంస్కృతి, ఉమ్మడి ఐక్యపోరాటాలు లేక బలమైన సొంత గొంతిక కలిగి తమ వాదాన్ని వినిపించాలనే తపన లేకపోవటం మరొక కారణం. ఈ లోపాన్ని సవరిస్తూ బి.సి.,లలోని యువకవులంతా ఒక్కటై ఒకే వేదికను భూమికగా చేసుకొని తమ అస్తిత్వాన్ని కాపాడుకోవాలనే కాంక్షతో కర్తవ్యోన్ముఖ బాధ్యతను గుర్తెరిగి ఏర్పడ్డ కవి సమూహమే బి.సి., రైటర్స్ యూత్.

బి.సి., కవులందరూ ఒక సమూహంగా మారి తమ సమస్యలపై గళంవిప్పుతూ కనుమరుగవుతున్న చేతి వృత్తులను, కుల పురాణాలను కాపాడుకోవలసిన ఆవశ్యకతను తెలియజేస్తూ అగ్రకుల ఆధిపత్యభావజాలాన్ని నిరసిస్తూ ఆర్ద్రమైన గొంతికతో సాంద్రత నిండిన హృదయంతో అద్భుతమైన కవిత్వాన్ని వ్యక్తీకరిస్తున్నారు. ఆక్రమంలో వెలువడిన కవితా సంకలనమే సమూహం.

"ఈ కవిత్వమొక సమూహం ఇదొక సామాజిక ఆర్తనాదం. ఈ నాదాలన్నీ వాదాలు, సంవాదాలు కావచ్చు. సంవేదనలు మాత్రం ఒక్కటే. ఈ కవుల సమూహం బి.సి., సామాజిక వర్గం ఈ కవిత్వం రాసిన కవులు ఊళ్ళో ఉన్నందున గర్వపడటం లేదు. వాడలో లేనందుకు సంతోష పడటం లేదు. అటు అగ్రవర్ణమూ కాలేక ఇటు ఉగ్రవర్ణంగా మారనూలేక సతమతమవుతున్నారని సీతారామ్‌గారు పలికిన మాటలు అక్షరసత్యాలు. ఈ కవితా

సంకలనంలో కవులంతా వాళ్ళవాళ్ళకులాల్లో నుంచి, తాతముత్తాతలు వాడిన చేతివృత్తులు, కులవృత్తుల నేపథ్యంలో నుంచి ఎండిన బతుకుల్లో నుంచి, ఆకలి మంటల్లో నుంచి, వాడిన పనిముట్ల భాషల్లో నుండి గొంతెత్తి కవితాగానం చేసారు. సమాజంలోని కుళ్ళు కుతంత్రాలకు తమ జాతి ఏ విధంగా వంచించబడిందో కళ్ళకు కట్టినట్లు ఈ సమూహంలోని కవులు విశదీకరించారు. వారు వాడిన ప్రతి పదం ఎదలోతుల్లో నుంచి వచ్చిన తూటాల్లా కన్పిస్తాయి. ముఖ్యంగా తరాలు మారుతున్నా ఇంకా అంతరాలు మారట్లేదనే ఆవేదన, అగ్రవర్ణాల పెత్తందారీతనంపై నిరసన భావన, అంతరించిపోతున్న తమ వృత్తులు, ప్రపంచీకరణ నేపథ్యంలో తమ కుల పురాణాలు, చేతివృత్తులు ఎలా కనుమరుగవుతున్నాయో వెల్లడిస్తున్నారు.

తమ ఉనికిని, అస్తిత్వాన్ని తామే ప్రశ్నించుకుంటూ అసలు తమకు స్వేచ్ఛ ఉందా! ఉంటే ఎలా ఉందో దృశ్యమాలికగా చిత్రా రాజేష్‌ఖన్నా 'బానిసకొక బానిస' కవితలో–

"బానిసకు స్వేచ్ఛ వుంటుందా!
ఆకాశమంత విహరిస్తున్నానని
గర్విస్తున్న గాలిపటం స్వేచ్ఛనీది" --- అంటూ తామెప్పుడూ ఒకరి చేతిలో బందీయై బానిస బతుకులు బ్రతుకుతున్న వైనాన్ని, వాస్తవాన్ని తెలియజేస్తారు. అయితే పరిస్థితులు అన్ని ఒకేలా ఉండవని నేటి యువతరం ఈ విషయాన్ని గమనిస్తూ తిరుగుబాటు ఉద్యమానికి బాటలు వేస్తుందని, ఒకరి చేతుల్లో బందీలుగాగాక తమను తామే పరిపాలించుకుంటామని కోంద్రు బ్రహం "మేమే పాలించుకుంటాం" కవితలో ఎలుగెత్తి చాటుతూ--

"చాకలి మంగలి పొత్త
ఇంటికి దాని ఇత్తు" అనే పిచ్చ సామెతలతో
మా ఐక్యతను దెబ్బ తీస్తిరి
ఇగ రాజ్యమెట్లస్తది
విభజించి పాలించే
నీ కపట సూత్రాన్ని కనిపెట్టలేని
దశాబ్దాలుగా వెనుకబడిన తరగతులం
ఇంకా వెనక్కి నెట్టేయకురి
అదిగో తూర్పున ఎర్రడాలు వేసింది
మా వాడల్లో, పల్లెలో ఉద్యమాల సర్వోదయమయితాంది
ఓట్లాయుధాలతో సిద్దంగున్నం
ఇక మేము పూలే – అంబేద్కర్ బాటలో నడుస్తం
మమ్ముల్ని మేమే పాలించుకుంటాం" అని ప్రకటిస్తాడు.

మదత భాస్కర్ "గరళ కంఠులం" కవితలో తమను ఈ దేశంలో మనుషులుగా కూడ చూడని అగ్రవర్ణ ఆధిపత్యాన్ని నిరసిస్తూ --

అనాదిగా అదేపనిగా
సురాపానకం అందిస్తున్న
మేం
భూ సుతులం కాకపోయ్యుండొచ్చు

కనీసం మనుషులం కాదా!
ఈ దేశంలో భాగం కాదా అని ప్రశ్నిస్తూ
పెద్ద పెద్దతుఫాన్లల్ల మూడు మాట్ల
మెరపెట్టి వచ్చినోళ్ళం
మీ అగ్రవర్ణపు అహంకారం జూసి
మాకిప్పుడు ........మెర......మెర.......అంటుంది
ఎండ్లనాటి మీ ఆధిపత్యాన్ని
ఎదుర్కోవడానికి 'మారకత్తి' నూరుతున్నాం" -- అంటూ ధిక్కార స్వరంతో హెచ్చరిస్తున్నాడు.

బి.సి.,లలో ఐక్యత లోపించిందని ముఖ్యంగా చేతివృత్తులు అచేతన వృత్తులుగా మారటానికి మనమే కారణమని అది తెలుసుకొని మసలవలసిన ఆవశ్యకతను విశదీకరిస్తూ దేవరకొండ భగవాన్ "పేరులోనే విశ్వం" కవితలో --

"ఇంతనైపుణ్యమున్నా -- పంచ వృత్తుల పంచకర్మలకు
ఐదేళ్ళు నోట్లోకి పోలేని దినాలెందుకు దాపురించనయ్?
ఐదు వృత్తుల ఐదు వేళ్ళు
పిడికిలి బిగించకపోవటం వల్లనే" -- అంటూ అనైక్యత లోపించిన విధానాన్ని భవిష్యత్ కార్యచరణ ప్రణాళిక ఆవశ్యకతను వివరిస్తాడు.

సమాజంలో పురుషులతోపాటు స్త్రీలు చైతన్యమవుతున్నారని అది చదువు వల్ల సాధ్యమయిందని దాంతో వాస్తవ విషయాలు ఇప్పుడప్పుడే అవగతమవుతున్నాయని, ఆక్రమంలో ఎన్నో ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయని అగ్రకుల పెత్తందారీ కామాంధకారానికి నేటి స్త్రీలు బలి అయ్యే పరిస్థితిలో లేరని కళ్ళెర్రజేస్తూ అంబటి భాగ్య "చదువుకున్న సావిత్రిభాయ్‌లం" కవితలో --

"ఇన్నాళ్ళు నాకసలు అర్థంకాని ....... ప్రశ్నలెన్నింటికో
చిక్కుముడి వీడుతున్నది ....... మాకు సమాధానాలెగావాలె
పాతకాలం ఎడ్డోలం కాదు ....... ఏం చెప్పినా తలూపడానికి
చదువుకున్న సావిత్రిభాయ్‌లం ....... ప్రశ్నల కొడవళ్ళం అంటూ
జనాభాలో మెజార్టీ ....... మా కడుపున పుట్టిన బిడ్డలే
ఒక్కసారి మేం కన్నెర్రజేస్తే ....... కాలే శరీరాలు మీవవుతాయ్
అదిగో కమ్మరికొలిమి దగ్గర ....... నా ఆడపడుచు నిప్పు రాజేస్తోన్నది" -- అని స్త్రీలలో వచ్చిన చైతన్య భావజాలాన్ని వెల్లడిస్తారు.

ప్రపంచీకణ నేపథ్యంలో కులవృత్తులు అంతరిచిపోతున్న వైనాన్ని రాయరాకుల కార్తికరాజు "చాకిరి బండ" కవితలో --

"బోసిపోయింది చాకిరేవు
నునుపుదేలిన చాకిబండలతో
మునుపున్నట్టు ఇప్పుడు లేని చాకలోళ్ళతో
మర యంత్రాలొచ్చినై కదా!
మార్కెట్లోంచి ఇంటింటికీ" -- ఇక చాకలితో అవసరమేముందని తన ఆవేదన వ్యక్తీకరిస్తాడు.

ఒకప్పుడు అగ్గిపెట్టెలో పట్టే చీర నేసినందుకు నేతన్న నేర్పరితనాన్ని చూసి అందరూ మెచ్చుకున్నవాళ్ళే, కాని పరిస్థితులు తారుమారయ్యి గ్లోబలైజేషన్ వ్యవస్థ తమ చేనేత వృత్తిని ఘోరీలు కదుతుందంటూ జంగం హైమావతి "పోగులగూడు" కవితలో --

"గీ గ్లోబలైజేషన్ వ్యవస్థలో ....... నేత గుడ్డని
రెడీమేడ్‌లు డామినేట్ చేస్తుంటే
మా సాలెల మగ్గాలు ....... అటక మీద బందీగాబడి
బూజుల్లుకుని రోదిస్తున్నాయి" -- అంటూ నిర్వేదంతో పలుకుతుంది.

కాలం మారుతుంది అయినప్పటికీ తమ బతుకులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడి మాదిరిగా మారని పరిస్థితిని సోన్నాయిల కృష్ణవేణి రాసిన "మారని బతుకు" కవిత చదివితే ఆర్ద్రమైన హృదయంతో మనస్సు కకావికల మౌతుంది. ఈ నాటికి మంగలి వాళ్ళు అనుభవిస్తున్న దుర్భర జీవితాన్ని వాస్తవిక జీవనాన్ని హృదయ విదారకంగా వెల్లడి చేసే విదానం, వాళ్ళ వృత్తిలో వాడే పనిముట్ల స్థానంలో క్రొత్త పరికరాలు వచ్చి తమ జీవనోపాధిని ఎలా దెబ్బ తీస్తున్నాయో తెలియజేస్తూ --

"ఔమల్ల మా అయ్య అన్నట్లే అన్ని మారనై
మా అయ్యా వాడిన మంగలి కలుపు
జాడలేకుండా పొవ్వింది
పాతకాలపు కత్తులు గోర్గాల్‌మారి
బ్లేడ్లు ట్రిమ్మర్‌ల్ అచ్చినాయ్
క్రొత్త క్రొత్త క్రీములు లోషన్లు అచ్చినాయ్
అన్ని మారినాయ్‌గనీ మా బతుకులే
ఎప్పటి శిప్ప ఎనుగుల్నే అన్నట్లున్నాయ్" -- అనటంలో తమ వృత్తులపై నాగరికతాకత్తులు దూస్తున్న వైనాన్ని హృదయ విదారకంగా వర్ణించింది.

సమూహం కవితా సంకలనంలో కవితలన్నీ వాడి వేడియైన భావజాలంతో, పదునైన భాషాశైలితో వ్రాయబడ్డాయి. ముఖ్యంగా వృత్తికి సంబంధించిన పనిముట్లు వాటిపేర్లను కళాత్మకంగా కవిత్వీకరించారు. సందర్భోచితమైన భాషతో వాడుక భాషను మమేకం చేసి గుండెను తట్టిలేపే విధంగా రచనలు చేసారు. సమాజంలో తరతరాలుగా తమ జాతి జనులు శ్రమదోపిడీకి గురిఅవుతూ రాజ్యాధికారానికి ఆమడ దూరంలో ఉండిపోలవసిన స్థితిని కళ్ళకు కట్టినట్లు చిత్రికబట్టారు. అగ్రవర్ణాల వారు తమ జాతి జనుల చెమట చుక్కలతో ఎటువంటి సౌఖ్యాన్ని అనుభవిస్తున్నారో చింతం ప్రవీణ్ "బిగ్‌బ్యాంగ్" కవితలో --

"మీ ఇండ్లకు దర్వాజలైనోల్లం
మీ పంటకు కంచెలైనోల్లం
మీ విందులకు కంచాలైనోల్లం
మీ కుట్రలకు సమాధులైనోల్లం" -- అంటూ ప్రతిచోట ప్రతిపనిలో తోడుండటంచేత మీ జీవితాలు సాఫీగా సాగుతున్నాయని తెలియజేస్తాడు. ఈ కవితల్లో చాలా మంది కవులు అంత్యాను ప్రాసాలంకారాలను ఉపయోగిస్తూ కవితలకు శబ్దసౌష్టవాన్ని కలగజేసారు. సరళ సుందర భాషలో సహజసిద్దమైన పారిభాషిక పదాలు ఉపయోగించి కవితలను రక్తి కట్టించడయేగాక ఆలోచనాత్మక దృక్పధానికి దారులు తీసారని చెప్పవచ్చు.